నిర్మల్ ఎమ్మెల్యేగా మహేశ్వర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 14 : నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం అసెంబ్లీలో స్పీకర్ ఎదుట ప్రమాణ స్వీకారం చేశారు. గతంలోనే అసెంబ్లీలో ఎమెల్యేలు ప్రొటెం స్పీకర్ ఎదుట ప్రమాణ స్వీకారం చేయగా..బీజేపీ ఎమ్మెల్యేలు ప్రొటెం స్పీకర్ ఎదుట ప్రమాణ స్వీకారం చేయబోమని బహిష్కరించిన విషయం విదితమే.నూతనంగా ఎన్నికైన స్పీకర్ ఎదుట ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.

ముథోల్ ఎమ్మెల్యేగా రామారావు పటేల్..

ప్రమాణ స్వీకారం చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్

భైంసా, డిసెంబర్, 14 : హైదరాబాద్‌లోని అసెంబ్లీలో గురువారం ముథోల్ ఎమ్మెల్యేగా రామారావు పటేల్ ప్రమాణ స్వీకారం చేశారు. శాసన సభలో మొదటి సారిగా రామారావు పటేల్ ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, డిసెంబర్ 14: ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖలలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. పోషకాహారలోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేకంగా పోషకాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటా సర్వే నిర్వహించి రోగాల బారిన పడకుండా ప్రజలకు జాగ్రత్తలు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి రమేశ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ధన్‌రాజ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి
- ఉమ్మడి ఆదిలాబాద్ సాఫ్ట్‌బాల్ అండర్-17 జోనల్‌స్థాయి పోటీలు ప్రారంభం

సాఫ్ట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

సారంగాపూర్, నవంబర్ 14 : క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుతుందని నిర్మల్ జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చించోలి(బీ) ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సాఫ్ట్‌బాల్ అండర్-17 జోనల్‌స్థాయి బాలబాలికల క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట జ్యోతి ప్రజ్వలన చేసి ఆటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మనసుకు ఆనందంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రీడా పోటీల్లో రాణించడం వల్ల భవిష్యత్‌లో మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ పతాని రాధ, సర్పంచ్ లక్ష్మి, మండల విద్యాధికారి మధూసుదన్, సెక్టోరియల్ ఆఫీసర్ రాజేశ్వర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమణారావు, పెటా కార్యదర్శి భోజన్న, ఎస్ఎంసీ చైర్మన్ సురేశ్, ఇన్‌చార్జి హెచ్ఎం కూన రమేశ్, పీఈటీ భూమన్న, అన్నపూర్ణ, బుచ్చి రామారావు, జమున, నారాయణవర్మ, తదితరులున్నారు.

జాతీయ స్థాయి శిబిరానికి ఎంపిక

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 14 : మంచిర్యాల డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ పానుగంటి అఖిల్ జాతీయ స్థాయి శిబిరానికి ఎంపికయ్యాడు. డిసెంబర్ 17 నుంచి 27 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూర్‌లో ప్రతిష్టాత్మక నిర్వహించనున్న ఇండియన్ మిలిటరీ అకాడమీ క్యాంప్‌నకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. అఖిల్‌ను ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ ఏఎన్‌వో తిరుపతి, వైస్ ప్రిన్సిపాల్ పట్వర్ధన్, అధ్యాపకులు అభినందించారు.

నాయకుడిలా కాదు..సేవకుడిలా వచ్చా

- పార్టీ కార్యకర్తలతో బీఆర్ఎస్ నేత భూక్యా జాన్సన్ నాయక్

కార్యకర్తలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత భూక్యా జాన్సన్ నాయక్

ఖానాపూర్, డిసెంబర్ 14: ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడద్దని, అండగా ఉంటానని బీఆర్ఎస్ నేత భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్, ఉట్నూర్ మండలాల పార్టీ శ్రేణులతో మట్లాడారు. తను రాజకీయాల్లోకి సేవ చేసేందుకు వచ్చానని నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హమీలు నెరవేర్చాలని, లేదంటే సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాడుతామన్నారు. ప్రజలు తనకు సమస్యలపై ప్రశ్నించే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రాజగంగన్న, వాల్ సింగ్, శంకర్, శ్యాం, శేఖర్, మెహ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- మంచిర్యాల డీఈవో ఎస్ యాదయ్య

విద్యార్థినికి బహుమతి అందించి అభినందిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 14 : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉన్నతి లక్ష్య కార్యక్రమాలతో పాటు వివిధ రకాల పథకాల అమలు చేస్తూ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రధానోపాధ్యాయులు చిత్తశుద్ధితో కృషి చేయాలని డీఈవో ఎస్ యాదయ్య పేర్కొన్నారు. గురువారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశం, శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో యాదయ్య హాజరై పలు సూచనలు చేశారు. పాఠశాలల ఉన్నతికి తోడ్పడడంలో ప్రధానోపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని, పేద విద్యార్థులకు అత్యంత నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రమోషన్లు పొందిన 45 మంది హెచ్ఎంలను తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సౌజన్యంతో సత్కరించారు. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన హెచ్ఎంలకు, జిల్లాకు వచ్చిన హెచ్ఎంలను సన్మానిం చారు. వివిధ రకాల కార్యక్రమాలపై సెక్టోరల్ అధికారులు, జిలాల సైన్స్ అధికారి ఓరియంటేషన్ నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సుధీష్ణ 120 పని దినాలకు 120 హాజరైనందున డీఈవో ప్రత్యేకంగా అభినందించి బహుమతి అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ కోఆర్డినేటర్లు చౌదరి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సత్యనారాయణ, జెండర్ కోఆర్డినేటర్ యశోదర, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, వివిధ మండలాల విద్యార్థులు, జిల్లాలోని హెచ్ఎంలు పాల్గొన్నారు.

నర్సాపూర్ (జీ) : ప్రధాన రహదారి పై రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

భైంసా : రాస్తారోకో చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

ఇచ్చోడ : పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు

ఉపాధి కల్పించండి

- ప్రభుత్వానికి ఆటో డ్రైవర్ల వినతి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వెల్లువెత్తిన నిరసనలు

నిర్మల్ అర్బన్ : నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

నిర్మల్ అర్బన్ : నిర్మల్‌లోని ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో నిరసనగా నిలిపిన ఆటోలు

కాంగ్రెస్ సర్కారు ప్రారంభించిన మహాలక్ష్మి పథకంతో తాము ఉపాధి కోల్పోతున్నామని, వెంటనే ఈ పథకాన్ని నిలిపివేయాలని కోరుతూ గురువారం ఆటో యూనియన్ల నాయకులు, యజమానులు, డ్రైవర్లు నిరసన చేపట్టారు. నిర్మల్‌లోని ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో ఆటోలను నిలిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. నిర్మల్ జిల్లాలోని నర్సాపూర్(జీ), లక్ష్మణచాంద, భైంసా మండల కేంద్రాల్లో రాస్తారోకో చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. తమ ఉపాధిపై దెబ్బ కొట్టేలా తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేదంటే తమకు ఉపాధి కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

-నిర్మల్ అర్బన్/ నర్సాపూర్ జీ / లక్ష్మణచాంద/ భైంసా/ ఇచ్చోడ/ డిసెంబర్ 14